నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ పీబీ కాలనీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు పీబీకాలనీ, ఓల్డ్ సఫిల్‌గూడ, సుధానగర్, ద్వారకామాయి కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాసులు,లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

ఉప్పల్: ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించారు. రోగులకు అందే సేవలపై ఆరా తీసారు. ఆసుపత్రిలో వారు ఎదుర్కొటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. రోగులకు సత్వర వైద్య సేవలందించాలని, లేకపోతే చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.

ప్రొఫెసర్ కోదండరాంకు నేతల శుభాకాంక్షలు



అల్వాల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉద్యమకారుల ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డిలు మంగళవారం తెలంగాణ జనసమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కోదండరాంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మూడు నెలలుగా మురుగు సమస్య



ఉప్పల్ లక్ష్మారెడ్డి కాలనిలో మురుగు పారుతున్న దృశ్యం

నడిస్తే పడిపోతామేమోనని భయమేస్తుంది



రోడ్డు మీద నడిస్తే చాలు కింద పడతామేమోనని భయపడుతున్నాం. పక్క నుంచి వాహనాలు వెళితే ఇక అంతే సంగతులు.ఒంటి మీద పూర్తిగా మురుగు నీరు పడుతోంది. ఇంట్లో నుంచి బయటకు వస్తే ముక్కు మూసుకోవాల్సిందే. నెలల తరబడి ఇలానే ఉంది. అధికారులు పట్టించుకోవాలి

– శైలజ స్థానికురాలు

చర్యలు తీసుకుంటాం

పాతకాలం లైన్స్ ఉన్నాయి. వాటిని పునరుద్ధరిస్తున్నాం. పెద్ద లైన్స్‌కు ప్రతిపాదనలు పెట్టాం. నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తాం. తాత్కాలికంగా వెంటనే సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, ఉప్పల్ జలమండలి అధికారి

అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారింది



గతంలో మా కాలనీ శుభ్రతకు మారుపేరుగా ఉండేది. ఇప్పుడు అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రసుగా మారింది. అధికారులకు ఫిర్యాదు చేస్తే రేపు మాపు అంటూ ఎప్పుడో ఒకరు వచ్చి చూసి వెళ్తున్నారు. తూతూ మంత్రంగా పని చేసి మమ అనిపించుకుని వెళ్తున్నారు.

– రామిరెడ్డి, లక్ష్మారెడ్డి కాలని నివాసి

ఉప్పల్ : ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఎక్కడ చూసినా మురుగు పరుగు పెడుతోంది. రెండు కాలనీల్లో ఏ కాలనీని చూసినా మురుగుతో ఇబ్బందులు పడుతున్నారు. పరిశుభ్రంగా ఉండే కాలనీలు సైతం మురికి వాడలుగా మారాయి. సివరేజ్ వ్యవస్థను జలమండలికి అప్పగించినప్పటి నుంచీ ఈ సమస్య మరింత పెరిగిందని కాలనీల అసోసియేషన్లు జలమండలి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.స్కూల్ విద్యార్థులు, చిన్నారులు రోడ్ల మీద నడవలేని పరిస్థితి ఉప్పల్ డివిజన్‌లో నెలకొంది. జలమండలి, ఉప్పల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న లక్ష్మారెడ్డి కాలనీ, సూర్యానగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, తదితర ప్రాంతాల్లో గత నాలుగు నెలలుగా రోడ్ల మీద మురుగు పారుతూనే ఉంది. మురుగు కాక పోతే మంచినీటి లీకేజీలు.. లేకుంటే మ్యాన్ హోల్స్ ఇలా నిత్యం రోడ్లపై పారుతూనే ఉంటుంది. ఇదే విషయాన్ని స్థానికులు, కాలనీ ఆసోసియేషన్ల ప్రతినిధులు జలమండలి, జీహెచ్‌ఎంసి అధికారులకు నిత్యం ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. రోడ్లు పాకురు పట్టి ద్విచక్ర వాహన దారులు స్కిడ్ ఆయ్యి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని గత నాలుగు నెలలుగా వందలాది మంది ప్రమాదాల బారినపడ్డారని వాపోతున్నారు. మొన్నటి వరకు ఎన్నికల విధుల్లో ఉన్నామని సాకులు చెప్పుకుంటూ వచ్చారని ఇప్పుడు అదే ఫిర్యాదులు చేస్తే అసలు సిబ్బంది లేరు ఇబ్బంది ఉందని జల మండలి అధికారులు నిర్లక్ష్య సమాధానం ఇవ్వడంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా పరిస్థితిని చక్కదిద్దకపోతే జలమండలి కార్యాలయం వద్ద కాలనీ వాసులతో వచ్చి ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కుషాయిగూడ నుంచి 117హెచ్ బస్ ప్రారంభం

కాప్రా: కుషాయిగూడ ఆర్టీసీ డిపో పరిధిలోని 117హెచ్ రూట్ బస్సును డిపో అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ చంద్రకాంత్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న 117 రూట్‌ను యథావిధిగా కొనసాగిస్తూ అదనంగా 117హెచ్ పేరుతో మరికొన్ని ప్రాంతాలను కలుపుకుని కుషాయిగూడ నుంచి ఉప్పల్ చేరుకుంటుందని తెలిపారు. కుషాయిగూడ, ఈసీఐఎల్, ఎస్పీనగర్,యునాని హాస్పిటల్, లక్ష్మీనగర్, ఇంద్రానగర్, హెచ్‌బీ కాలనీ, క్రిష్ణనగర్ మీదుగా ఎన్‌ఎఫ్‌సీ ఎక్స్‌రోడ్‌కు చేరుకుని తిరిగి యథావిధి రూట్‌ను కలుపుకుని ఉప్పల్ చేరుకుంటుందన్నారు. కుషాయిగూడలో మొదటి బస్సు ఉదయం 6.50 గంటలకు ప్రారంభమవుతుందని, చివరి బస్సు రాత్రి 8.50 గంటలకు ఉంటుందని, ఉప్పల్ నుంచి ఉదయం 5.55 గంటలకు మొదటి బస్సు, రాత్రి 8 గంటలకు చివరి బస్సు ఉంటుందని తెలిపారు. ప్రతి 12 నిమిషాలకు ఒక బస్సు ప్రయాణీకులకు అందుబాటులో ఉండనున్నట్లు డిపో మేనేజర్ పేర్కొన్నారు.

పెట్రోల్‌బంకుల కిటకిట

వాహనాలతో నిండిన రోడ్లు

- బంకుల వద్ద బారులు తీరిన వాహనాదారులు..
- పోలీసు పహారాలో బంకుల నిర్వహణ



కుషాయిగూడ: ట్యాంకర్ డ్రైవర్ల సమ్మె కారణంగా పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ స్టాక్ లేదంటు సామాజిక మాధ్యమాలు, టీవీల్లో వచ్చిన వార్తలతో మంగళవారం సాయంత్రం నగరంలో అలజడి రేగింది. ఈ వార్త దావానలంలా వ్యాపించడంతో గందగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లపై ఉన్న వాహనాదారులతో పాటుగా, ఇళ్లలో ఉన్నవారు సైతం వాహనాలతో పెట్రోల్ బంకుల వైపుగా పరుగులు తీశారు. దీంతో రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బంకులన్నీ వాహనాలతో నిండిపోయి అట్టుడికాయి. తోపులాటలు, ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఓ దశలో నిర్వాహకులు నో స్టాక్ బోర్డు పెట్టి తప్పుకున్నారు. ఇదంతా గంటల వ్యవధిలోనే జరిగిపోయింది. రాత్రి పొద్దుపోయే వరకు బంకుల్లో వాహనాల రద్దీ ఏ మాత్రం తగ్గలేదు. బంకుల వద్ద పోలీసు పహారా ఏర్పాటు చేసి పెట్రోల్, డీజిల్ పోశారు. అయితే అప్పటికే ట్యాంకర్లు తమ సమ్మెను విరమించినట్లు ప్రకటించారు. పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లు బంకులకు బయలుదేరాయి. సమ్మె విరమించినా వాహనదారులు పట్టించుకోలేదు. గంటల తరబడి బంకుల వద్ద పడిగాపులు గాసి పని పూర్తి చేసుకొనే వెళ్లారు.



బారులు తీరిన వాహనదారులు

మల్కాజిగిరి: ట్రాన్స్‌పోర్ట్ వాహన యజమానుల నిరసనతో మూడు రోజులు పెట్రోల్ బంక్‌లకు సరఫరా ఉండదన్న వార్తలతో బంక్‌ల వద్ద వాహనదారులు బారులు తీరారు. మల్కాజిగిరిలోని సఫిల్‌గూడ, శారదానగర్, వెంకటేశ్వరనగర్ ప్రాంతాల్లో పెట్రోల్ బంక్‌ల వద్ద నుండి వాహనాలు రోడ్డు మీదకు రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయడంతో పోలీసులు పరిస్థితిని చక్కదిద్దుతున్నారు.

కాప్రా: భారత్ బంద్ పేరుతో బుధవారం పెట్రోల్ బంక్‌లు మూసివేస్తారని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్ల ఆందోళన చేపట్టారని బుధ, గురువారం పెట్రోల్ బంక్‌లు మూసివేస్తారని సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు విస్తృత ప్రచారం కొనసాగుతోంది. దీంతో వాహనదారులు తమ వాహనాలతో పెట్రోల్ బంక్‌ల వద్దకు పరుగులు తీశారు. అక్కడ ఇంధనం కోసం బారులు తీరారు. ఒక్కో పెట్రోల్ బంక్ వద్ద దాదాపు వందల మంది వాహనదారులు క్యూకట్టారు. దీంతో కాప్రా, ఏఎస్‌రావునగర్ డివిజన్లలో ఏ పెట్రోల్ బంక్ చూసినా వాహనదారులతో కిక్కిరిసిపోయాయి.



ఏఎస్‌రావునగర్‌లో ఓ పెట్రోల్ బంక్ వద్ద బారులుతీరిన వాహనదారులు.



రా చెరువును సర్వే చేపట్టిన అధికారులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న రా చెరువును మంగళవారం అధికారులు సర్వే పనులను చేపట్టారు. చెరువులో చేపలు పెంచుకునే ముదిరాజ్ కులస్తులు, అఖిల పక్ష నేతలు, బీజేపీ, స్థానిక నేతలు చెరువు కబ్జాకు గురవుతుందని, చెరువు తూంను మూసేసి, చెరువు కింద ఉన్న రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఇరిగేషన్ ఏఈ పరమేశ్, ఆర్ఐ సునీత, సర్వేయర్ రూప సర్వే చేపట్టారు. చెరువు చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ భూములతోపాటు చెరువును డిజిటల్ సర్వే చేపట్టారు. బోడుప్పల్ అఖిల పక్షం అధ్యక్షులు ఎల్లగోని బాలరాజ్‌గౌడ్ మాట్లాడుతూ చెరువు కింద ఉన్న సర్వేనెంబరు 262లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, కబ్జా దారుల నుంచి దానిని కాపాడి ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించాలని కోరారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



అల్వాల్: ఓల్డ్ అల్వాల్ దక్షిణ తిరుపతిగా పిలిచే శ్రీగుండం బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేక హోమాలు, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో బీట్కూరు సంపత్‌కుమార్ ఆచార్యులు, ధర్మకర్తలు పరాంకుశం మాధవాచార్యులు, ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీధర్, రాము, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నేత



ఉప్పల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత మందుముల పరమేశ్వర్‌రెడ్డి మంగళవారం రాష్ట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చినట్లు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



అలంకరణలో మూలవిరాట్

మల్కాజిగిరి: మల్కాజిగిరి గీతానగర్‌లోని శారదా చంద్ర మౌళీశ్వరాలయం (అయ్యప్ప దేవాలయంలో) నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజ ఘనంగా జరిగింది. కమలా నగర్ రాజు గురుస్వామి భజన బృందం ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. ప్రతి ఏటా నూతన సంవత్సరం రోజున పడిపూజ ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు అభినందన విజయ్‌కుమార్, సూర్యం, రాజ్‌కుమార్, సుందరేషం లు తెలిపారు. అనంతరం అయ్యప్పభక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

ప్రజాపాలనకు విశేష స్పందన

కాప్రా: రాష్ట ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు విశేష స్పందన లభిస్తోంది. కాప్రా సర్కిల్‌లోని ఆరు డివిజన్లకు సంబంధించి అభయహస్తం పేరుతో స్వీకరించే దరఖాస్తులు మంగళవారం వరకు మొత్తం 39,960 వచ్చాయి. ఇతర దరఖాస్తులు 9,035 వచ్చినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఒక్క రోజే ఆరు డివిజన్లలో 8,711 అభయహస్తం దరఖాస్తులు ఇతర దరఖాస్తులు 2,926 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

మంగళవారం కాప్రా డివిజన్‌లో అభయహస్తం దరఖాస్తులు 736, ఇతర దరఖాస్తులు 417 , ఏఎస్‌రావునగర్ డివిజన్‌లో అభయహస్తం 682, ఇతర దరఖాస్తులు 348, చర్లపల్లి డివిజన్‌లో అభయహస్తం 2,418, ఇతర దరఖాస్తులు 681, మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్‌లో అభయహస్తం 1,366, ఇతర దరఖాస్తులు 413, నాచారం డివిజన్‌లో అభయహస్తం 1,223, ఇతర దరఖాస్తులు 406, మల్లాపూర్ డివిజన్‌లో అభయహస్తం 2,286, ఇతర దరఖాస్తులు 661 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మొత్తం ఇప్పటి వరకు డివిజన్ల వారిగా వచ్చిన దరఖాస్తులు కాప్రా డివిజన్‌లో అభయహస్తం దరఖాస్తులు 5,167, ఇతర దరఖాస్తులు 1,543, ఏఎస్‌రావునగర్ డివిజన్ అభయహస్తం దరఖాస్తులు 3,807, ఇతర దరఖాస్తులు 663, చర్లపల్లి డివిజన్‌లో అభయహస్తం 9,107, ఇతర దరఖాస్తులు 1,546, మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీలో అభయహస్తం 6,777, ఇతర దరఖాస్తులు 1,856, మల్లాపూర్ డివిజన్‌లో అభయహస్తం 8,854, ఇతర దరఖాస్తులు 1,982, నాచారం డివిజన్‌లో అభయహస్తం 6,248, ఇతర దరఖాస్తులు1,445 దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

ట్రాన్స్ జెండర్స్‌కు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



ట్రాన్స్ జెండర్లకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న దశ్యం

రామంతాపూర్: రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్స్‌కి కూడా రాష్ట ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని రామంతాపూర్‌లోని మౌంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ టెక్‌నాథ్, ట్రాన్స్ జెండర్ల అసోసియేషన్ అధ్యక్షులు ముకుంద మాల మంగళవారం రాష్ట మహిళా శిశు సంక్షేమ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంతో దుర్భర పరిస్థితిలో జీవితం వెళ్లదీస్తున్న ట్రాన్స్ జెండర్‌లకు ప్రత్యేక ప్రజాపాలన శిబిరాలు నిర్వహించి సంక్షేమ పథకాలు లబ్ధి పొందేలా చూడాలని వారు వినతిపత్రంలో కోరారు.

ఇందుకు మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించి త్వరలోనే ట్రాన్స్ జెండర్‌లకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ప్రీతి సునంద వాసవి తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలి



దీపాదాస్ మున్షీకి దాస్ మున్షీకి శుభాకాంక్షలు తెలుపుతున్న యూత్ కాంగ్రెస్ నేతలు

రామంతాపూర్ : తెలంగాణ రాష్ట పార్టీ రాష్ట ఇంచార్జిగా నియమితులై రాష్ట్రానికి మొదటిసారిగా విచ్చేసిన దీపాదాస్ మున్షిని మంగళవారం గాంధీ భవన్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కంది శ్రావణ్‌రెడ్డి ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి దీక్షతో కృషి చేసిన యువజన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కూడా రాష్ట్రం నుంచి కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు విజయం సాధించే విధంగా కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు యువజన కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వసతులు కల్పించాలి

మల్లాపూర్: మల్లాపూర్ సూర్యనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని 100 పడకాల ఆస్పత్రిగా మెరుగుపర్చాలని కోరుతూ రాష్ట వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఆస్పత్రిలో వసతులను కల్పించాలన్నారు. ఓల్డ్ మల్లాపూర్, నెహ్రూ నగర్ మూడవ బ్లాక్‌లో కమ్యూనిటీహాల్‌లు కుడా అందుబాటులో ఉన్నందున్న బస్తీ దవఖానలను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించిన్నట్లు వారు తెలిపారు.



మంత్రి దామోదర రాజ నర్సింహకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

కల్యాణలక్ష్మి నిరుపేదలకు వరం



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్: నిరుపేదలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వరం లాంటివి అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో 82 మందికి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి సాయిజెన్ శేఖర్, మందుముల రజిత పరమేశ్వరరెడ్డి, బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, కక్కిరేణి చేతన, ఉప్పల్ తహసీల్దార్ వెంకట నర్సింహా రెడ్డి, బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, సాయిజెన్ శేఖర్,పోగుల దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, నాగర్జుననగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలించిన ఆమె పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. డివిజన్‌లో మెరుగైన వసతుల కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీతరాముయాదవ్

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని న్యూ మిర్జాల్‌గూడలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి వేగంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర, స్థానిక నాయకులు మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



మల్లాపూర్: మల్లాపూర్ యువదళ్ కమిటీ సభ్యులు ఎండీ హైదర్ జన్మదిన వేడులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో మంగళవారం నాచారం జాన్‌పాషా దర్గా వద్ద ఘనంగా జరుపుకున్నారు. ముందుగా జాన్ పాషా దర్గాలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లాపూర్ యువదళ్ అధ్యక్షులు ఎండీ ఉస్మాన్, బీఆర్ఎస్ డివిజన్ పధాన కార్యదర్శి వాసుదేవ్‌గౌడ్, పీఆర్ ప్రవీణ్, ఎండీ సిద్దిక్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలి



ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మధుసూదననగర్ కమ్యూనిటీహాలులో ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాన్ని మంగళవారం కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దరఖాస్తులు స్వీకరించాలని ఆమె అధికారులను కోరారు.

అన్నోజిగూడలో అండర్‌పాస్ స్థల పరిశీలన



అన్నోజిగూడలో ఎన్టీపీసీ చౌరస్తాను పరిశీలిస్తున్న డా.లక్ష్మణ్

పోచారం: అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద అండర్ పాస్ నిర్మించాలని ప్రజల నుంచి డిమాండ్ రావడంతో ఆ ప్రాంతాన్ని రాజ్యసభ సభ్యుడు డా.లక్ష్మణ్ మంగళవారం పరిశీలించారు. అండర్ పాస్ లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు రాజీవ్ గృహకల్ప కాలనీవాసులు లక్ష్మణ్‌కు వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మేడిపల్లి: చెత్త ఆటో వేగంగా వస్తూ బైక్‌ను ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా మరో మహిళకు తీవ్రగాలయ్యాయి. ఈ సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు..నాచారానికి చెందిన లొంపి బాబి(32) స్థానికంగా అపోలో ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై భార్య రోజాతో కలిసి మేడిపల్లి వైపు వెళుతున్నాడు. చెంగిచర్ల వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న చెత్త వాహనం వేగంగా వస్తూ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాబికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.